క్లుప్తంగా

రక్తదానం ప్రాణాలు కాపాడుతుంది



రక్తదానం చేస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

కర్నూలు(హాస్పిటల్): దాతలు ఇచ్చే రక్తదానం వల్ల కొన్ని ప్రాణాలు నిలబడతాయని మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపారు. కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆమె రక్తదానం చేశారు. తలసీమియా పిల్లలకు ఏదైనా అవసరమైతే తప్పకుండా తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ ఆస్వక్, జనరల్ సెక్రటరీ జి.సురేష్‌బాబు, ఈసీ మెంబర్ సుజాత, నక్కలమిట్ట శ్రీనివాసులు, అన్వర్‌బాషా, చరిత, ఖుద్దుస్, దాదాబీ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ చౌర్యం, అనధికార వినియోగంపై దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి అక్రమదారులపై కేసులు నమోదు చేశారు. 19 బృందాలుగా ఏర్పడి కర్నూలు, నంద్యాలలోని 47 మండలాల్లోని 3044 కనెక్షన్ల తనిఖీలు చేపట్టారు. ఇందులో నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడే 103పై కేసు నమోదు చేసి రూ.1.05 లక్షలు, ఇతర కారణాతో 253 మందిపై కేసులు నమోదు చేసి రూ.4.81 లక్షలు జరిమానా విధించినట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు.

విద్యుత్ సమస్యలపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాల, గాలి వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయ సమస్యలపై వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, తీగలపై చెట్ల కొమ్మలు పడి సరఫరాలో అంతరాయం ఏర్పడిన ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటిపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. జిల్లా స్టోర్స్ కార్యాలయంలో కావాల్సిన సామగ్రి తీసుకెళ్లి పనులు చేసి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు.

25న సాంఘిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 25న సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో సాంఘిక నాటక ప్రదర్శనలు ఉంటాయని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కళాంజలి వారి 'మనిషి మంచోడే', ప్రముఖ రచయిత గోవింద రాజుల నాగేశ్వరరావు రచించి కోల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన 'పాశం' నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

'వేదవతి'ని పూర్తి చేయాలి



జేసీకి వినతిపత్రంఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో చేపడుతున్న వేదవతి ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులు ఎస్ఎన్ రసూల్, మునెప్ప, మద్దిలేటి శెట్టి, పి.రామకృష్ణారెడ్డి.. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని జేసీని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీనే కొనసాగించాలి



ధర్నా నిర్వహిస్తున్న గెస్ట్‌ఫ్యాకల్టీ

కర్నూలు సిటీ: కేజీబీవీల్లో పీజీటీ, సీఆర్‌టీలుగా పనిచేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీగా మెరిట్ ప్రాతిపదికగానే ఎంపికయ్యామని, ఈ ఏడాది రెన్యూవల్ చేయకుండా నోటిఫికేషన్ జారీ చేసి తమకు అన్యాయం చేస్తున్నారని గెస్ట్‌ఫ్యాకల్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు డీఈఓ ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. తమను పార్ట్‌టైంగా తీసుకున్నప్పటికీఉద్యోగ ధర్మంగా ఫుల్ టైం పని చేశామని, కేజీబీవీల్లో అడ్మిషన్ల కోసం కాన్వాస్ చేశామని, సమ్మర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు సైతం నిర్వహించామన్నారు. పోస్టుల భర్తీలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వీరికి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

జగనన్న తోటలో విరిసిన కుసుమాలు

- ఆటంకం లేకుండా జగనన్న విద్యా, వసతి దీవెన
- చంద్రబాబు పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్
- ఏడాదికి సగటున 80 వేల మంది విద్యార్థులకు లబ్ధి
- నాలుగేళ్లలో తల్లుల ఖాతాల్లోకి రూ.464 కోట్లు

నాడు డాక్టర్ వైఎస్సార్ నాటిన ఫీజు రీయంబర్స్‌మెంట్ మొక్క నేడు మహా వృక్షమై వేలాది కుటుంబాలకు ఫలాలను ఇస్తోంది. తండ్రి చేపట్టిన ఫీజు రీయంబర్స్‌మెంట్ మహా యజ్ఞానికి తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకంగా ఉన్న ఫీజు విధానాన్ని మార్చి విశ్వ విద్యాలయాల్లో నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేసి తల్లిదండ్రులకు నయాపైసా ఆర్థిక భారం లేకుండా చేస్తున్నారు.

– కర్నూలు(అర్బన్)



విద్యా సంవత్సరం	విద్యా దీవెన	వసతి దీవెన
2019-20	రూ.91,99,46,101	రూ.39,89,85,000
2020-21	రూ.75,58,07,286	రూ.46,19,32,500
2021-22	రూ.84,46,77,664	రూ.42,25,88,200
2022-23	రూ.47,95,18,580	రూ.36,57,60,000
మొత్తం:	రూ.299,99,49,631	రూ.164,92,65,700

గతంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలవుతూ వచ్చాయి. కానీ కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్ -1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలు మినహాయించి మిగిలిన ఫీజు ఆయా వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలోనే అనేక మంది తల్లిదండ్రుల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫీజు రీయంబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా జగనన్న విద్యా దీవెన ద్వారా విశ్వ విద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంది. దీంతో అనేక మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ పూర్తి చేసి జీవితంలో స్థిరపడుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు.

చంద్రబాబు పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్

2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజును కూడా వైఎస్ జగన్ సర్కార్ 2019-20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. జిల్లాలో 32,162 మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

తల్లుల ఖాతాల్లోకి నాలుగేళ్లలో రూ.464 కోట్లు

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో ఇప్పటి వరకు జగనన్న విద్యా వసతి దీవెన కింద అక్షరాల ప్రతి ఏడాది సగటున 80 వేల పైచిలుకు మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.464 కోట్లు జమ అయ్యాయి.

సంతోషంగా ఉంది



మాది చిత్తూరు జిల్లా కల్లూరు. నాన్న ఎం.హేమంత్ రాజ్ వ్యాపారం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. కుటుంబం అందించే ఆర్థిక తోడ్పాటుకు జగనన్న విద్యా దీవెన,వసతి దీవెన రూపంలో కళాశాల ఫీజును భరించడం వల్ల ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేశాను. చివరి ఏడాది కూడా విద్యా దీవెన కింద రూ.70 వేలు విడుదలయ్యాయి. ప్రస్తుతం నాకు హైదరాబాద్ డీబీఎస్ బ్యాంకులో ఆఫర్ వచ్చింది. చదువు అయిపోవడంతోనే ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. – ఎంహెచ్ లాస్య, బీటెక్ ఫోర్త్ ఇయర్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల

నా కల నెరవేరింది



ఇంజినీరింగ్ చదవాలనే నా కల జగనన్న రూపంలో నెరవేరింది. నాన్న గోపాల్‌రెడ్డి పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు. ప్రభుత్వం విడుదల చేసే జగనన్న విద్యా దీవె న, వసతి దీవెనతో చదివిన నేను ప్రస్తుతం పూనెలోని ఐబీఎం కంపెనీలో అప్లికేషన్ డెవలపర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.ప్రస్తుతం ఏడాదికి రూ.4.50 లక్షలు జీతం ఇస్తోంది. జగనన్నకు రుణపడిఉంటాం. – ఏ.వెంకటవిజయలక్ష్మి,కురుకుంద, ఆత్మకూరు మండలం

యాక్సెంచర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది



కరోనా కష్టకాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కింద ప్రతి ఏడాది రూ.70 వేలు ఫీజును ప్రభుత్వం విడుదల చేయడం వల్ల నాలాంటి ఎంతో మంది విద్యార్థులకు హెల్ప్ అయ్యింది. నయాపైసా ఖర్చు లేకుండా స్థానిక బృందావన్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే ఏడాదికి రూ.5.25 లక్షల ప్రకారం హైదరాబాద్‌లోని యాక్సెంచర్ కంపెనీలో అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనలిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. నాన్న వై.లక్ష్మిరెడ్డి జనరల్ స్టోర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

– వై చంద్రిక, బాలాజీనగర్, కర్నూలు

నాలుగేళ్లలో రూ.464 కోట్లు



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్న విద్యా దీవెన మొత్తాలను సంబంధిత కళాశాలల్లో నిర్ణీత సమయంలోగా చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. విద్యా, వసతి దీవెనకు సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు గ్రామ/వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, మా కార్యాలయంలో కూడా ఎల్లప్పుడు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈ నాలుగేళ్లలో విద్యా, వసతి దీవెన కింద మొత్తం రూ.464,92,15,331లు తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయి.

– జె.రంగలక్ష్మీదేవి, జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ

చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నేడు కర్నూలు రాక

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత, జౌళిశాఖ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత శుక్రవారం కర్నూలు రానున్నట్లు ఆప్కో డివిజనల్ మేనేజర్ భారతీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత సాయంత్రం కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న లేపాక్షి ఎంపోరియంలో ఆప్కో కౌంటర్‌ను ప్రారంభిస్తారన్నారు. అనంతరం డోన్‌లో సేంద్రియ పద్ధతుల్లో పత్తి సాగుపై నిర్వహించే అవగాహన సదస్సులో పాల్గొంటారన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

కర్నూలు: స్థానిక మద్దూర్ నగర్ ఆటో స్టాండ్ వద్ద ఉన్న వ్యాపార దుకాణాల్లో మైనర్ దొంగ చేతివాటం ప్రదర్శించాడు. శ్రీకృష్ణ ఆయుర్వేదిక్ స్టోర్, ఆర్‌కే లేడీస్ కార్నర్, జాయ్ స్పోర్ట్స్ వేర్ దుకాణాల్లో చోరీ జరిగింది. ఆయా దుకాణ యజమానులు బుధవారం రాత్రి వ్యాపారాలు ముగించుకుని తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా సామాన్లన్నీ చిందరవందరగా ఉండడటమే కాక ఆయా దుకాణాల్లో భద్రపరచిననగదు సొమ్ము కనిపించలేదు. అందులోని ఒక దుకాణంలో సీసీ కెమెరా ఉండటంతో అందులో పరిశీలించగా మైనర్ బాలుడు ఆయా దుకాణాల్లో చొరబడి చోరీకి పాల్పడినట్లు ఫుటేజీలో నిక్షిప్తమై ఉంది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం మూడు దుకాణాల్లో రూ.11 వేలు నగదు తస్కరించినట్లు వాటి యజమానులు వెల్లడించారు.

26 నుంచి కుష్ఠువ్యాధిగ్రస్తుల సర్వే

కర్నూలు(హాస్పిటల్): ఈనెల 26 నుంచి జులై 16వ తేదీ వరకు కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేపట్టనున్నట్లు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. గురువారం డివిజన్ పీహెచ్‌సీ లెప్రసీ నోడల్ అధికారులకు, యూపీహెచ్‌సీ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ చర్మంపై తెల్లని రాగి మచ్చలు, స్పర్శ లేకపోవడం గమనించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులకు చూపించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఎస్.శివశంకర్, డిప్యూటీ హెచ్ఈఓ ఎస్.దేవప్రసాద్, ఫిజియోథెరపిస్ట్ బి.రెడ్డిబాబు, డీపీఎంఓ ఎం.గోవిందరాజులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతిచెందిన అనిల్

కర్నూలు: కర్నూలు–అలంపూర్ వెళ్లే రైలు మార్గంలో తుంగభద్ర బ్రిడ్జి సమీపంలో ఓ యువకుడు గురువారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీ బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన నాగప్ప, సునంద దంపతుల రెండో కుమారుడు మల్లెపోగు అనిల్ అలియాస్ ఆదాం (22) ఇంటర్ వరకు చదువుకున్నాడు. ఉపాధి నిమిత్తం తిరుపతిలో సమీప బంధువుల దగ్గరికి వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి బుధవారం సాయంత్రం కర్నూలు చేరుకున్నాడు. గురువారం ఉదయం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో అనిల్ మృతదేహం రెండు ముక్కలుగా విడిపోయింది. మృతదేహాన్ని రైలు కొంత దూరం ఈడ్చుకుపోయింది. మృతుని లగేజీ బ్యాగు కూడా మరి కొంత దూరంలో పడిపోయింది. ప్రమాదవశాత్తూ రైలుపై నుంచి పడి మృతిచెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా, తిరుపతికి వెళ్తున్నట్లు చెప్పిన వ్యక్తి హైదరాబాద్ వైపు వెళ్లే రైలు మార్గంలో మృతిచెందడంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు చెప్పే విషయాలు జరిగిన ఘటనకు పొంతన కుదరకపోవడంతో పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. వెనుకబడిన మండాలల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనుల అమలుపై ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం తక్కువగా ఉన్నప్పటికీ పురోగతి సాధించకపోవడానికి కారణాలేమిటని కర్నూలు రూరల్, హొలహర్వి, ఆలూరు, పెద్దకడబూరు, ఆదోని రూరల్, గూడూరు అర్బన్, కోడుమూరు ఎంపీడీఓలను ప్రశ్నించారు. రెండు రోజుల నుంచి ఎలాంటి పురోగతిని సాధించని కర్నూలు హౌసింగ్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తికొండ, ఆలూరు, హొలహర్వి మండలాలు కూడా పురోగతి సాధించాలన్నారు. ఆన్‌లైన్ అడ్వాన్స్ పేమెంట్ బుకింగ్స్‌లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఏ సమయంలోనైనా సర్వర్ క్లోజ్ కావొచ్చని, అందుకే పెండింగ్‌లో ఉన్న మండలాలు ఆన్‌లైన్ అడ్వాన్స్ పేమెంట్ బుకింగ్స్‌ను పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు శాతాన్ని పెంచాలని, వర్షాలు పడినా ఉపాధి హామీ పనులు జరిగేలా చూడాలని, హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించిన వివరాలను బ్లూ ఫ్రాగ్ యాప్‌లో నమోదుచేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

కొనసాగుతున్న వెరిఫికేషన్



సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో టీచర్, ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా జరుగుతున్న మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతోంది. రెండో రోజు గురువారం అభ్యర్థినులు భారీగా రావడంతో సమగ్ర శిక్ష కార్యాలయం కిక్కిరిసిపోయింది. 233 పోస్టులు భర్తీ చేసేందుకు ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. జాబితాలోని విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను సీనియర్ ప్రధానోపాధ్యాయుల చేత వెరిఫికేషన్ చేయిస్తున్నారు. ఒక్కో సబ్జెక్టుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు, అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను, వారి విద్యార్హతల మార్కుల జాబితాలను పరిశీలిస్తున్నారు. శుక్రవారంతో వెరిఫికేషన్ ప్రక్రియ ముగియనుంది.

25 నుంచి లతీఫ్ లౌబాలి దర్గా ఉరుసు



లతీఫ్ లౌబాలి దర్గా

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని హజరత్ సయ్యద్ షా అబ్దుల్ లతీఫ్ అల్ ఖాదరి అల్ హౌదరి లౌబాలి ఖదస్‌ సిర్రహుల్ అజీజ్ దర్గా ఉరుసు ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు హజరత్ డాక్టర్ సయ్యద్ షా హాషిం ఆరీఫ్ బాద్‌షా ఖాదరి అల్ హైదరీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జగద్గురువు హజరత్ పీర్ దస్తగిర్ గౌసుల్ వంశీయులు లతీఫ్ లౌబాలి జన్మస్థలం ఇకార్ దేశంలోని బాగ్దాద్ సమీపంలోని హమలీ పట్టణమని, జగద్గురువు ఆజ్ఞ మేరకు భారతదేశానికి వచ్చి కర్నూలు నగరంలో స్థిరపడినట్లు పేర్కొన్నారు. సర్వమానవాళిని అల్లాహ్ వైపు నడిపించేందుకు కృషి చేసినట్లు వెల్లడించారు. వీరి ఉరుసు ఏటా ఇస్లామిక్ క్యాలెండర్ జిల్‌హజ్ 6న జరుగుతుందని, ఇంగ్లిష్ క్యాలెండర్‌లో జూన్ 25 తేదీ నుంచి నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం రాత్రి 10 గంటలకు తరీమన్ ఖబలీ, ముషాయిరా, 26న ఉదయం నమాజు తరువాత గుసులే షరీఫ్, సాయంత్రం అసర్ నమాజు తరువాత హల్‌ఖే జికర్, మగరీబ్ నమాజ్ తరువాత వలి అల్లాహ్ గొప్పతనంపై ఉపన్యాసం, ఇషా నమాజు తరువాత పీఠాధిపతి హజరత్ సయ్యద్ షాఅబ్దుల్లా హుసైనీ పీర్ సాహెబ్ ఇంటి నుంచి గంధం ఊరేగింపు ఉంటుందని వెల్లడించారు. 2న సాయంత్రం అసర్ నమాజ్ తరువాత ఖురాన్ గ్రంథ పఠనం, మగరిబ్ నమాజ్ తరువాత ఫాతెహా, దువా కార్యక్రమాలు దర్గా పీఠాధిపతి, గౌసుల్ ఆజం సంతతి సయ్యద్ హుసైని బాద్‌షా ఆధ్వర్యంలో జరుగుతుందనారు.

వ్యవసాయ నీళ్ల మోటార్ల దొంగల అరెస్టు

- 12 మోటార్లు, రెండు ఆటోలు, రూ.65 వేల నగదు సీజ్



వ్యవసాయ నీళ్ల మోటర్లను స్వాధీనం చేసుకుని దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: వ్యవసాయ నీళ్ల మోటార్లు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న దొంగల ముఠా ఆట కట్టించారు పోలీసులు. వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురయ్యాయని బాధితుల ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నాల్గవ పట్టణ పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను సంతోషనగర్ సుంకులమ్మ ఆలయం వద్ద అరెస్టు చేసి కటకటాలకు పంపారు. కల్లూరు మండలం ముజఫర్ నగర్‌కు చెందిన సురేష్ గోపాల్, ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన ఎరుకలి బాలనాగన్న అలియాస్ బాలు, కర్నూలు శ్రీనివాసనగర్‌కు చెందిన గానిగ రామప్ప, వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన పరశురాం, శివప్ప నగర్‌కు చెందిన బాలుడు ముఠాగా ఏర్పడి కర్నూలు తాలూకా పీఎస్ పరిధిలో పది, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, ఓర్వకల్లు పీఎస్ పరిధిలో రెండు మోటర్లను చోరీ చేశారు. అందులో ఏడు మోటార్లకు సంబంధించి రాగి వైరును బయటకు తీసి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మరో 12 మోటార్లను సంతోష్‌నగర్ శివారులోని ముళ్లపొదల్లో ఆటోల్లో భద్రపరచి బయటకు తరలించడానికి సిద్ధంగా ఉంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 12 మోటార్లతో పాటు రెండు ఆటోలను, రూ.65 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం నిందితులను మీడియా ముందు హాజరుపరిచి సీఐ శంకరయ్య వివరాలు వెల్లడించారు. ఒక ఆటోను కడపలో చోరీ చేసినట్లు విచారణలో బయటపడిందని సీఐ తెలిపారు. ఇందుకు సంబంధించి కడప వన్‌టౌన్ పీఎస్‌లో ఆటో చోరీ కేసు నమోదైనట్లు తెలిపారు. మొత్తం ఐదుగురు ముఠా సభ్యుల్లో నలుగురిని రిమాండ్‌కు పంపి బాలుడిని కర్నూలు బి.క్యాంప్‌లోని జ్యువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

నేడు టిడ్కో రుణ మేళా

కర్నూలు (టౌన్): టిడ్కో గృహ లబ్ధిదారుల కోసం శుక్రవారం రుణ మేళా నిర్వహిస్తున్నామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం నగరపాలక కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారన్నారు. లబ్ధిదారులు రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమాదేవి, ఎల్‌డీఎం రామచంద్రరావు, మెప్మా పీడీ నాగశివలీల, సీఎంఎం మురళీ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై నేడు సమీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశం నిర్వహిస్తుందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో డ్వామా, డీఆర్‌డీఏ–వైకేపీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, అటవీ, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దిశ కమిటీకి కర్నూలు ఎంపీ ఎస్.సంజీవ్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, జిల్లా కలెక్టర్ మెంబర్ సెక్రటరీ, ఎమ్మెల్యేలు సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు.

నేడు బీజేపీ బహిరంగ సభ

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ సంపర్క అభియాన్ బహిరంగ సభను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మిగనూరు తేరు బజార్‌లో నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి అధ్యక్షతన జరిగే సభకు కేంద్ర కమ్యూనికేషన్, ఐటీ శాఖ మంత్రి దేవ్ సిన్హా చౌహాన్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ సునీల్ థియోధర్ హాజరవుతారన్నారు.

కొట్టంబడి స్థలం పరిశీలన

కర్నూలు (రూరల్): స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని కొట్టంబడి స్థలాన్ని కల్లూరు తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు గురువారం పరిశీలించారు. కొట్టంబడి స్థలానికి ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని పూర్వ విద్యార్థులు, అఖిలపక్ష పార్టీల నాయకులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): జులై 1 నుంచి అమల్లోకి రానున్న జగనన్న సురక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సూచించారు. గురువారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. అలాగే కుల, నివాస, ఆదాయ, వివాహ, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ ఫర్ కరెక్షన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించిన కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్లు తొలగింపు తదితర సేవలు అందించాలన్నారు. సమావేశంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో తాత్కాలిక ఉద్యోగాల భర్తీ

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని బాలల సంరక్షణ విభాగంలో రెండు నెలలే పనిచేసేందుకు 12 మందిని తాత్కాలికంగా నియమించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వారికి నియామక పత్రాలు అందజేశారు.

కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచాలి



వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, నాయకులు వెంకటేష్, మునిస్వామి, ప్రసాద్, శేఖర్, తదితరులు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్‌ను కలసి వినతి పత్రం అందించారు.

గోవులకు రక్షణ కల్పించండి

కర్నూలు: బక్రీద్ నేపథ్యంలో గోవులకు రక్షణ కల్పించాలని బీజేపీ ప్రతినిధిబృందం కర్నూలు డీఎస్పీ విజయ్‌శేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో పలు చోట్ల వధించడానికి ఆవులను తరలిస్తున్నారని, వాటికి రక్షణ కల్పించాల్సిందిగా వినతిపత్రంలో కోరారు. బీజేపీ నాయకులు హరీష్ బాబు, విక్కీ వెంకటేశ్వర్లు, నాగేంద్ర, ప్రవీణ్ యాదవ్, గణేష్, వెంకటేష్, సునిల్ డీఎస్పీని కలిశారు.

నిందితులను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): గోనెగండ్ల మండలం గంజహళ్లిలో బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాలు, గంజిహళ్లి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకని కర్నూలుకు బయలుదేరిన బాలిక తల్లిదండ్రులను అడ్డుకున్న గోనెగండ్ల ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్, నాయకులు కేవీ నారాయణ పాల్గొన్నారు.

ప్రతిరోజూ యోగా చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రతి రోజు యోగా చేయడం వల్ల వ్యాధులు దరిచేరవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక విద్యుత్ భవన్‌లో ఉద్యోగులతో యోగా, మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచం గుర్తించిందన్నారు. ఉద్యోగులు విధుల వల్ల ఒత్తిళ్లకు గురవుతుంటారని, దానిని తట్టుకునేందుకు యోగా చక్కగా ఉపయోగపడుతుందన్నారు.